వేగంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు

- క్షేత్రస్థాయిలో పూర్తయిన పరిశీలన
- తుది విచారణకు గెజిటెడ్ అధికారుల నియామకం

ఇల్లెందురూరల్: ఇందిరమ్మ పథకంలో భాగంగా ఇళ్ల మంజూరు కోసం అర్హుల ఎంపికపై కసరత్తు ముమ్మరంగా సాగుతోంది. గ్రామసభల ద్వారా మండల వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్లకు 16,205 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఆయా దరఖాస్తులను పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో విచారించి 4,634 మంది అర్హుల జాబితాను రూపొందించారు. సొంత స్థలం ఉన్న వారు 3,084 మంది, స్థలం లేని వారు 1,550 మందిని అర్హులుగా, మిగిలిన 11,581 మందిని అనర్హులుగా నిర్ధారించారు. మోడల్ గ్రామంగా ఎంపికైన పూబెల్లిలో 83 మందికి ఇళ్లు మంజూరయ్యాయి. వీరుకి పోను మొదటి విడతగా మండల వ్యాప్తంగా 705 ఇళ్లు మంజూరు చేయనున్నారు. ఒడ్డుగూడెం గ్రామపంచాయతీ నుంచి తమ గ్రామానికి ఎక్కువ ఇళ్లు కావాలంటే మా గ్రామానికి ఎక్కువ కావాలంటూ కమిటీ సభ్యులు ఏకంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయంలలో ఘర్షణకు దిగారు. వివాదం ముదురుతుండగా కాంగ్రెస్ మండల నాయకులు కలగజేసుకుని వారికి సర్ది చెప్పారు. ఇలా పలు గ్రామాల్లో వివాదాలు బహిర్గతం కాగా మరికొన్ని గ్రామాల్లో కొందరు నేతలు తమ మాట నెగ్గలేదని అసంతృప్తితో ఉన్నారు.

తుది విచారణకు గెజిటెడ్ అధికారులు...

ఇందిరమ్మ ఇళ్లకు అర్హులుగా గుర్తించిన 705 మంది జాబితాను ప్రభుత్వం గెజిటెడ్ అధికారులకు విచారణ బాధ్యతను అప్పగించింది. ప్రతీ అధికారికి 200 ఇళ్ల వరకు విచారణ చేపట్టేలా జాబితాను అందజేశారు. శుక్రవారం నుంచి విచారణ ప్రారంభించారు. లబ్ధిదారుల స్థితిగతులు ఎలా ఉన్నాయి.. వంటి నిబంధనలను పరిశీలిస్తున్నారు.


ఇల్లెందురూరల్: పూబెల్లిలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇల్లు


జూలూరుపాడు: అనంతారంలో బేస్‌మెంట్ పూర్తయిన ఇందిరమ్మ ఇల్లు


ఇల్లెందురూరల్: బాలాజీనగర్‌లో విచారణ చేస్తున్న వ్యవసాయశాఖ అధికారి సతీష్

అనర్హులకు అవకాశం ఉండదు..



ప్రభుత్వం ప్రకటించిన నిబంధనలు పాటిస్తూ వచ్చిన దరఖాస్తులను పంచాయతీ కార్యదర్శులతో పరిశీలన చేయించాం. అర్హుల జాబితాను సిద్ధం చేశాం. ప్రస్తుతం ఇందిరమ్మ కమిటీల విచారణ ముగిసింది. తుది విచారణ కోసం గెజిటెడ్ అధికారులకు బాధ్యతలు అప్పగించాం. అనర్హులకు అవకాశం ఉండకూడదన్న లక్ష్యంతో విచారణ పకడ్బందీగా చేపడుతున్నాం.

– ధన్‌సింగ్, ఎంపీడీఓ, ఇల్లెందు మండలం

- పైలట్ ప్రాజెక్టుకు ఎంపికైన అనంతారం
- 85 ఇళ్లు మంజూరు.. లబ్ధిదారుల్లో ఆనందం

జూలూరుపాడు: పేదోడి సొంతింటి కలను నెరవేర్చాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేస్తోంది. జూలూరుపాడు మండలం అనంతారం గ్రామాన్ని రాష్ట్ర ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా ఎంచుకుంది. గ్రామంలో 210 కుటుంబాలు, 749 జనాభా. అర్హులందరికీ ఇళ్లు మంజూరు కావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ 76 ఇళ్లకు ప్రొసీడింగ్ ఇవ్వగా గ్రామసభలో కొత్తగా తొమ్మిది మంది దరఖాస్తు చేసుకోవడంతో అప్రూవల్ రావల్సి ఉంది. 76 ఇళ్లకు గాను 49 ఇళ్లు గ్రౌండింగ్ కాగా, 12 ఇళ్లు బేస్‌మెంట్ లెవల్ పూర్తయింది. మరో 11 ఇళ్లకు పునాది పనులు జరుగుతున్నాయి. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జనవరి 26న అనంతారం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో 85 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను అధికారులు చేశారు. మార్చి 16న వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్నాయి. అయితే ఇప్పటి వరకు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఉచిత ఇసుక కూపన్లు అధికారులు ఇవ్వలేదు. మండలంలో ఇసుక రీచ్‌లు లేకపోవడం వల్ల ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై అధికారులు కసరత్తు చేస్తున్నా. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి పర్యవేక్షిస్తున్నారు.

లబ్ధిదారులను ప్రోత్సహిస్తున్నాం..



ప్రతి లబ్ధిదారుడు ఇల్లు నిర్మించుకునేలా ప్రోత్సహిస్తున్నాం. గత ప్రభుత్వ పదేళ్ల పాలనలో ఒక్క నిరుపేద కుటుంబానికి కూడా ఇల్లు మంజూరు కాలేదు. ప్రస్తుత ప్రభుత్వం 85 ఇళ్లు మంజూరు చేసింది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరగతిన పూర్తి అయ్యేలా ఇందిరమ్మ కమిటీ సభ్యులమంతా కృషి చేస్తున్నాం. ఇళ్లు మంజూరు చేసిన ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు.

– కొర్సా రమేష్, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు, అనంతారం

క్లుప్తంగా

దేవాలయ భూమి సర్వే

జూలూరుపాడు: పాపకొల్లు శ్రీఉమాసోమలింగేశ్వర స్వామి దేవస్థానం మాన్యం భూమిని దేవాదాయశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సర్వే నిర్వహించారు. పాపకొల్లు రెవెన్యూ పరిధి గుండ్లరేవు, రాంపురంతండా గ్రామాల సరిహద్దులో సర్వే నంబర్ 1050లో 4.00 ఎకరాలు, 1051లో 6.16 ఎకరాలు, మొత్తం 10.16 ఎకరాలకు సర్వే నిర్వహించి, హద్దులు పెట్టారు.

మే డే పోస్టర్లు ఆవిష్కరణ


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇల్లెందు: ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే ఘనంగా నిర్వహించాలని టీయూసీఐ జిల్లా కార్యదర్శి యాకుబ్‌షావలీ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఇల్లెందులోని మాస్‌లైన్ కార్యాలయం వద్ద పోస్టర్లు ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా మే డే నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాయం వెంకన్న, వీరన్న, నాయిని కృష్ణ, సీతారాములు, రాజమ్మ, సంజీవ్ పాల్గొన్నారు.

తాగునీరు సరఫరా చేయండి..


నిరసన తెలుపుతున్న మహిళలు

ఇల్లెందురూరల్: ఒడ్డుగూడెం గ్రామపంచాయతీ నెహ్రూనగర్‌లో మిషన్ భగీరథ ద్వారా ప్రతీ ఇంటికి తాగునీటి సరఫరా చేయడం లేదని, అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ స్థానిక మహిళలు శుక్రవారం ఖాళీ బిందెలతో ప్రధాన రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. పలువురు మహిళలు మాట్లాడుతూ.. మిషన్ భగీరథ నీటిని గ్రామంలో కొంత ప్రాంతానికి మాత్రమే సరఫరా చేస్తున్నారని, గతంలో అధికారులకు చెప్పినా పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం బోర్లు, బావుల నుంచి నీటిని తెచ్చుకుంటున్నామని, అవి కూడా అడుగంటుతుండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని భగీరథ నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని, లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఏఐటీయూసీ కృషి ఫలితమే..

ఇల్లెందు: సింగరేణిలో జనరల్ మజ్దూర్‌లను ఇక నుంచి జనరల్ అసిస్టెంట్లుగా మార్చుతూ సింగరేణి యాజమాన్యం నిర్ణయం తీసుకోవటం పట్ల ఏఐటీయూసీ హర్షం వ్యక్తం చేసింది. శుక్రవారం ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన బ్రాంచి కార్యవర్గ సభ్యుల సమావేశం విఠల్‌రావు భవన్‌లో జరిగింది. డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె.సారయ్య, బ్రాంచి కార్యదర్శి నజీర్ అహ్మద్ మాట్లాడుతూ... ఈ నిర్ణయంతో 14 వేల మందికి పేరు మార్పు జరిగిందన్నారు. జాతీయ స్థాయి వేజ్‌బోర్డు సమావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం సింగరేణిలో జీఓ విడుదల చేశారని తెలిపారు. కోల్ ఇండియా వ్యాప్తంగా ఇదే పేరుతో పిలుస్తున్నట్లు చెప్పారు. ఏఐటీయూసీ ఫలితంగా ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజారామ్, మంచాల వెంకటేశ్వర్లు, బి.శ్రీనివాస్, జి.కృష్ణ, దాట్ల వెంకటేశ్వర్లు, యుగంధర్, బాలాజీ, ఎన్ శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, చాంద్‌పాషా, రవి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ఎస్‌ఐ


శ్రీనివాసరెడ్డి

ఇల్లెందు: పట్టణ – 2వ ఎస్‌ఐగా పి.శ్రీనివాసరెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. 2014 బ్యాచ్‌కు చెందిన శ్రీనివాసరెడ్డి మట్టివాడ, కేసముద్రం, గార్లలో విధులు నిర్వహించారు. వీఆర్‌లో ఉన్న ఆయన ఇల్లెందు ఎస్‌ఐ సందీప్ కుమార్ స్థానంలో నియామకం అయ్యారు.

ఆర్థికసాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

సూపర్‌బజార్(కొత్తగూడెం): వేడి నీళ్లలో పడి తీవ్ర గాయాల పాలై ప్రాణాపాయ స్థితిలో ఉన్న చిన్నారికి టీఎస్‌ఆర్ ట్రస్ట్ అధినేత తాండ్ర వెంకటేశ్వరరావు శుక్రవారం రూ.30వేలు ఆర్థికసాయం అందించారు. రామవరానికి చెందిన ఆటో డ్రైవర్ కళ్యాణ్ పాసి, సబియానాజ్ దంపతుల నాలుగేళ్ల కుమార్తె కృతిక నాలుగు నెలల క్రితం వేడినీళ్ల బకెట్‌లో పడడంతో తీవ్రంగా గాయాలయ్యాయి. చికిత్సకు సుమారుగా ఇప్పటి వరకు రూ.5లక్షలు ఖర్చు అయింది. ఆర్థిక స్థోమత లేక దాతల సాయాన్ని కోరడంతో పాల్వంచకు చెందిన టీఎస్‌ఆర్ ట్రస్ట్ స్పందించి ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో తాండ్ర బుచ్చిబాబు, నాగబాబు, పుల్లారావు, తొగరు రాజశేఖర్, తాండ్ర మణికంఠ, మారెడ్ల నరసింహారెడ్డి పాల్గొన్నారు.

న్యాయ వ్యవస్థ స్వతంత్రతను కాపాడుకుందాం..


జడ్జికి తీర్మానం కాపీ అందజేస్తున్న న్యాయవాదులు

కొత్తగూడెంటౌన్: న్యాయవాద వ్యవస్థ స్వతంత్రను కాపాడుకుందామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్‌కు శుక్రవారం న్యాయవాద పరిషత్ జిల్లా అధ్యక్షుడు అనుబ్రోలు రాంప్రసాద్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కొత్తగూడెం జిల్లా కోర్టులోని జడ్జి చాంబర్‌లో పాటిల్ వసంత్‌ను న్యాయవాద పరిషత్ జిల్లా సభ్యులు కలిశారు. రాంప్రసాద్ మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో ఉన్నత న్యాయస్థానాల్లో జరిగిన సంఘటనలు దేశాన్ని ఉలిక్కిపడేలా చేశాయని, అందుకే న్యాయ వ్యవస్థ స్వతంత్రను కాపాడుకునేందుకు స్వతంత్ర న్యాయ వ్యవస్థ మన బాధ్యత అనే అంశంపై అఖిల భారతీయ ఆదివక్త పరిషత్ జాతీయ కార్య నిర్వాహక సమావేశంలో తీర్మానాన్ని విజయవాడలో ఆమోదించడం జరిగిందన్నారు. ఈ విషయంలో న్యాయ వ్యవస్థ పారదర్శకంగా ఉండాలని కొన్ని తీర్మానాలను చేసినట్లు జడ్జికి కాపీని అందజేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో న్యాయవాద పరిషత్ సభ్యులు గోదా రాంచంద్రారెడ్డి, సీనియర్ న్యాయవాది జీవీకే మనోహర్, కిరణ్ ముద్కర్, జనరల్ సెక్రటరీ పిల్లి వేణు, వాసురావు, కాసాని రమేష్, మహేష్, కొప్పాడ మురళీ, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

సర్వే పకడ్బందీగా చేపట్టాలి


ఇల్లెందురూరల్: మాట్లాడుతున్న డీఎల్‌పీఓ రమణ


పాల్వంచరూరల్: లక్ష్మీదేవిపల్లిలో లబ్ధిదారుల ఎంపికకు సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

ఇల్లెందురూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే పకడ్బందీగా చేపట్టాలని, ఆ బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉంటుందని డీఎల్‌పీఓ రమణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తుది దశ విచారణకు వస్తున్న గెజిటెడ్ అధికారులతో వెంట ఉండి తప్పిదాలకు అవకాశం లేకుండా అధికారులకు సహకరించాలని సూచించారు. తదనంతరం ఇళ్ల నిర్మాణ పురోగతి పర్యవేక్షణ బాధ్యత కూడా కార్యదర్శులపై ఉంటుందన్నారు. లబ్ధిదారులు, జాబితాలో పేర్లు లేని వారితో వాగ్వావాదాలకు, చర్చలకు అవకాశం ఇవ్వొద్దని, సామరస్యంగా సమాధానం చెప్పాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ ధన్‌సింగ్, ఎంపీఓ చిరంజీవి, విచారణ అధికారులు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: ఇందిరమ్మ పథకం ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఎంపికకు అధికారులు శుక్రవారం సర్వే ప్రారంభించారు. మండలంలోని 36 గ్రామపంచాయతీల్లో 2,646 మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో గ్రామ కార్యదర్శులు దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి సర్వే నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సుధా తెలిపారు.

యాజమాన్య పద్ధతులు పాటించండి..

టేకులపల్లి: వానాకాలం 2025–26 సీజన్‌లో భూమిలో సారవంతం, సేంద్రియ కర్బనం పెంచేందుకు మెరుగైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయ శాఖ ఇల్లెందు ఏడీఏ గుగులోత్ లాల్‌చంద్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం మాట్లాడుతూ.. గత సంవత్సరపు పంట అవశేషాలు, వ్యవసాయ వ్యర్థాలు భూమిలో కలియదున్నితే కర్బనము, భూసారం, నీటిని నిలుపుకునే తత్వం, భూమి భౌతిక, రసాయనిక స్థితి మారి అధిక దిగుబడికి దోహదపడుతుందని, ఎట్టి పరిస్థితిలోనూ పంట అవశేషాలు కాల్చొద్దని సూచించారు. వేసవి కాలంలో లోతుగా దుక్కి దున్నడం వలన భూమిలో చీడపీడల అవశేషాలు నశించి పంట వేరు వ్యవస్థ వేగంగా వృద్ధి చెందడానికి అనుకూలించకపోవడంతో పాటు మొక్క ఆరోగ్యంగా ఉండి నాణ్యమైన దిగుబడి వస్తుందన్నారు. తొలకరిలో మాగిన పశువుల ఎరువు, చెరువు మట్టి, నాడెప్ కంపోస్టు, వర్మీ కంపోస్టు, కోళ్ల, గొర్రెల ఎరువులను వేసుకుని భూసారం పెంచుకుంటే మొక్కల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. భూమిని దున్నే క్రమంలో వాలుకు అడ్డంగా చేను చుట్టూ కందకము తవ్వడం, బోదెసాళ్ల పద్ధతి, ఎత్తైన బెడ్ పద్ధతి పాటించినట్లయితే భూసారం కానీ, అదేవిధంగా నీరు భూమిలో ఇంకి భూగర్భ జలం పెరిగి పంట కాపాడుతుందని పేర్కొన్నారు.

నూతన బొగ్గు గనులు ఏర్పాటు చేయాలి


ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

కొత్తగూడెంఅర్బన్: సింగరేణి సంస్థ పరిరక్షణకు నూతన బొగ్గు గనులను ఏర్పాటు చేసి సంక్షేమ చర్యలు విస్తృత పర్చాలని టీబీజీకేఎస్ రాష్ట్ర ముఖ్య ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ అన్నారు. శుక్రవారం తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆధ్వర్యంలో హెడ్డాఫీస్ ఎదుట ధర్నా నిర్వహించి జీఎం కవితనాయకుడుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ ఉనికికే ప్రమాదంగా మారిన బొగ్గు గనుల వేలంలో పాల్గొనవద్దని, సింగరేణి సంస్థలో మెడికల్ రిఫరల్ విధానాన్ని సులభతరం చేసి కార్మికులకు అనువైన మెడికల్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. రామగుండం, కొత్తగూడెం, బెల్లంపల్లి రీజియన్లలో కార్మికుల కుటుంబాలకు రక్షిత మంచినీటి సౌకర్యం కల్పించాలన్నారు. కుసానా వీరభద్రం, గడప రాజయ్య, తుమ్మ శ్రీనివాస్, వశికర్ల కిరణ్, కాగితపు విజయ్ కుమార్, బూర్గుల రవికుమార్, మాదాసు ఈశ్వర్, కంచర్ల శ్రీనివాస్, ప్రసాద్, మహేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'ఏలూరి'కి నివాళి

ఇల్లెందు/ఇల్లెందురూరల్: సీపీఎం సీనియర్ నాయకులు ఏలూరి లక్ష్మీనారాయణ 33వ వర్ధంతిని శుక్రవారం ఆ పార్టీ నేతలు ఇల్లెందులోని సీపీఎం కార్యాలయంలో, ఇందిరానగర్ గ్రామపంచాయతీ సుందరయ్య నగర్‌లో నిర్వహించారు. ఏలూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్‌ఏ నబీ, ఆలేటి కిరణ్, కృష్ణ, మోహన్‌రావు, మరియ, వెంకటమ్మ, అబ్బాస్, బోస్, నాగరాజు, సోమకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మలేరియాను నిర్మూలిద్దాం..


ఇల్లెందు: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది


జూలూరుపాడులో ...

ఇల్లెందు: ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా ఇల్లెందు ప్రభుత్వాస్పత్రి సిబ్బంది శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ.. భారతదేశంలో 2030 వరకు మలేరియాను సమూలంగా నిర్మూలించాలన్న లక్ష్యంతో భారత ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాష్ట్రంలో మలేరియా ఒక్క కేసు కూడా నమోదు కాని జిల్లాలు ఉన్నాయని తెలిపారు.

ఇల్లెందురూరల్: మలేరియాను సమూలంగా నిర్మూలించేందుకు ప్రతీఒక్కరు కృషి చేయాలని రొంపేడు పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ కవిత, డాక్టర్ మురళీకృష్ణ అన్నారు. మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం పీహెచ్‌సీల పరిధిలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేసవి నుంచే తగు జాగ్రత్తలు తీసుకుంటూ వర్షాకాలం నాటికి దోమలను నివారించితే మలేరియా వ్యాప్తిని నిలువరించే అవకాశం ఉంటుందన్నారు.

టేకులపల్లి: ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవాన్ని సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈమేరకు అవగాహన ర్యాలీ నిర్వహించి సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. వైద్యాధికారి కంచర్ల వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీహెచ్‌ఓ ఎం.రామకృష్ణ మాట్లాడుతూ... మలేరియాను నిర్మూలించడమే లక్ష్యమన్నారు. ప్రజలు ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

విద్యావిధానంలో మార్పులు చేయాలి



మాట్లాడుతున్న రవి

పాల్వంచరూరల్: విద్య అందరికీ అందే విధంగా నూతన విద్యావిధానంలో సంస్కరణలు, మార్పులు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి డిమాండ్ చేశారు. పెద్దమ్మగుడి సముదాయంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం సంఘం జిల్లాశాఖకు ఉద్యమ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఉపాధ్యాయ ఉద్యమం.. సాధించిన విజయాలు.. అనే అంశంపై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచడానికి ఉపాధ్యాయులు స్థానికుల సహకారం తీసుకోవాలన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి నేటి వరకు జరిగిన ఉద్యమ తీరుతెన్నులను వివరించారు. మురళీమోహన్, బి.రాజు, ఎం.వెంకటేశ్వర్లు, వరలక్ష్మి, ఎం.రాజయ్య, ఎస్.వెంకటేశ్వర్లు, హతీరామ్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి చిత్తశుద్ధి ఇదేనా..?


కిష్టారంలో ఆర్‌ఓ ప్లాంట్ దుస్థితి


లచ్చగూడెంలో...

- నిరుపయోగంగా నాలుగు ఆర్‌ఓ ప్లాంట్లు
- సురక్షిత నీటికి నోచుకోని ప్రజలు

టేకులపల్లి: కోయగూడెం ఓపెన్‌కాస్టు ప్రభావిత ప్రాంతాల ప్రజల ఆరోగ్యంపై సింగరేణి చిత్తశుద్ధి లోపించింది. ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి, సంక్షేమానికి సీఎస్‌ఆర్ పథకం ద్వారా నిధులు విడుదల చేయాల్సిన బాధ్యత కంపెనీలకు ఉంటుంది. ఇందులో భాగంగా సుమారు ఐదేళ్ల క్రితం కోయగూడెం ఓపెన్‌కాస్టు ప్రభావిత గ్రామాలకు సురక్షిత తాగునీరు అందించేందుకు టేకులపల్లి మండలంలోని స్టేషన్ తడికలపూడి, కిష్టారం, లచ్చగూడెం, గంగాపురం (కోయగూడెం) గ్రామాల్లో ఆర్‌ఓ (మినరల్ వాటర్) ప్లాంట్లను ఏర్పాటు చేశారు. గదులు నిర్మించి యంత్ర సామగ్రిని కూడా అమర్చారు. కానీ ప్రారంభోత్సవాన్ని మాత్రం మరిచారు. దీంతో విలువైన యంత్ర సామగ్రి తుప్పుపట్టి దెబ్బతింటున్న పరిస్థితి. సింగరేణి అధికారుల నిర్లక్ష్యం కారణంగా కేటీసీ ప్రభావిత గ్రామాల ప్రజలు సురక్షిత తాగునీటికి నోచుకోవడం లేదు.

అధికారులు నిర్లక్ష్యం వీడాలి..



ఓపెన్‌కాస్టు ప్రభావిత గ్రామాల సంక్షేమంపై సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యం వీడాలి. బ్లాస్టింగ్ వల్ల ఇళ్లకు పగుళ్లు సంభవిస్తున్నాయి. దుమ్ము, ధూళితో నీరు కలుషితం అవుతోంది. భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. ప్రజారోగ్యం పట్ల యాజమాన్యం దృష్టి సారించాలి.

– ఈసం నరసింహారావు, సీపీఎం మండల కార్యదర్శి

ఆర్‌ఓ ప్లాంట్లను ప్రారంభించాలి..



సింగరేణి అధికారులు కిష్టారం, లచ్చగూడెం, స్టేషన్ తడికలపూడి, గంగాపురం గ్రామాల్లో ఆర్‌ఓ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. కానీ ప్రారంభించకపోవడం గర్హనీయం. అధికారులు స్పందించి వెంటనే ఆర్‌ఓ ప్లాంట్లను ప్రారంభించి ప్రజలకు సురక్షిత తాగునీటిని అందించాలి.

– గుగులోత్ రాంచందర్, సీపీఐ మండల కార్యదర్శి

ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నిరసనలు

కొత్తగూడెంఅర్బన్: పహల్గాంలో జరిగిన పాక్ ప్రేరేపిత ఉగ్రదాడి భారతదేశ సమగ్రత, సమైక్యతను, మత సామరస్యాన్ని దెబ్బతీసే కుట్రని, ఈ కుట్రలను సమష్టిగా తిప్పికొట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్, సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు, ఉర్దూ ఘర్ చైర్మన్ నయీమ్ ఖురేషి, కాంగ్రెస్ నాయకులు నాగ సీతారాములు, ఆళ్ల మురళి అన్నారు. యాత్రికులపై జరిగిన టెర్రరిస్టుల దాడికి నిరసనగా, మృతులకు నివాళులర్పిస్తూ కొత్తగూడెం ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రైల్వే స్టేషన్ సెంటర్‌లో మానవహారం నిర్మించి మృతులకు నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ముస్లిం జేఏసీ నాయకులు ఉమర్ ఫరూక్, అబ్దుల్ రబ్, ఎండీ షరీఫ్, ఎండీ అబిద్, అమీర్ ఖాద్రి, జావేద్, ఎండీ అయూబ్, అన్వర్, బాబు జానీ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు: జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకుల మీద ఉగ్రవాదులు మారణకాండ సృష్టించి హతమార్చిన సంఘటనను ఇల్లెందులోని ముస్లింలు తీవ్రంగా ఖండించారు. శుక్రవారం పట్టణంలోని పలు మజీద్‌లలో నమాజ్ చేసిన ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ముస్లిం పెద్దలు మాట్లాడారు. ర్యాలీలో బీఆర్‌ఎస్, సీపీఐ, సీపీఎం నేతలు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: పహల్గాంలో ఉగ్రవాదులు దాడి చేసి పర్యాటకులను మట్టుపెట్టడం క్షమించరాని నేరమని మండలంలోని కోరగుట్ట వాకర్స్ క్లబ్ ఆగ్రహం వ్యక్తం చేసింది. శుక్రవారం కోరుగుట్ట వద్ద పహల్గాం మృతులకు నివాళులర్పిస్తూ ఉగ్రవాదుల దాడి పట్ల నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

సుజాతనగర్: పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ సుజాతనగర్‌లో వర్తక వ్యాపారవర్గాలు, మహిళల ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. కాల్పుల్లో మృతి చెందిన వారికి నివాళి అర్పిస్తూ మౌనం పాటించారు.

పాల్వంచ: భారతదేశంలో మతోన్మాద ఉగ్రవాదాన్ని ఖండించాలని, దీనిని పూర్తిగా ప్రభుత్వాలు నిర్మూలించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా అన్నారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారికి సీపీఐ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో ముత్యాల విశ్వనాథం, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, బండి నాగేశ్వరరావు, డి.సుధాకర్, వి.పద్మజ, అన్నారపు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. టూరిస్టులపై పాకిస్తాన్‌కు చెందిన ఉగ్రవాదుల దాడి అత్యంత హేయమైందని, దీనిపై ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఉందని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సెంటర్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. కార్యక్రమంలో నూకల రంగారావు, ఎస్‌ఏ.జలీల్, బాలినేని నాగేశ్వరరావు, సాధం రామకృష్ణ, బద్ది కిషోర్, కాల్వ భాస్కర్ రావు, మహేశ్, వెంకటాచారి, రాము, చాంద్‌పాషా, బండి నాగరాజు తదితరులు పాల్గొన్నారు. దాడులు చేసి ప్రాణాలు తీయమని ఏ మతం చెప్పదని, ఇది ఇస్లాం ధర్మ వ్యతిరేకం అని, అమాయక ప్రజలపై దాడి చేసి హతమార్చిన ఉగ్రవాదులను బహిరంగంగా ఉరితీయాలని పాల్వంచ జమా మజీద్ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. మజీద్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. కార్యక్రమంలో ఫయాజుల్ హసన్, ఇబ్రహీం ఖురేషి, ఖాజా అహ్మద్, మస్తాన్ ఖురేషి, ఫక్రుద్దీన్, రహీం, షారుక్, హన్ను తదితరులు పాల్గొన్నారు.


కొత్తగూడెంఅర్బన్: సూపర్‌బజార్ సెంటర్‌లో మానవహారం చేపట్టిన దృశ్యం


ఇల్లెందులో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు